


# 'అ ఆ' లు నేర్పిన గురుదేవులకి అక్షరాంజలి

## ప్రమీలా చంద్రమోహన్

చాల చిన్నతనంలో నాకు విద్య నేర్పిన ప్రథమ గురువు మా అమ్మే కాని నాకు ఊహ తెలిసి పాఠశాలకు వెళ్ళిన తొలి అయిదు సంవత్సరాలు తీర్చిదిద్దిన ఘనత మా 'శారదాంబ' టీచర్‌దే 'సకల సద్గుణ నికరాంబ మా శారదాంబ' అనే నానుడి ఆమె పట్ల అక్షర సత్యం.

నేను విద్య నేర్చిన పాఠశాల పేరెన్నిక కలిగిన చిల్డ్రన్స్ గార్డెన్ స్కూలు మైలాపూర్‌లో ఉండేది. అత్యున్నత ప్రమాణాలు విద్యలోనే కాక ఆల్‌రౌండ్ డెవలెప్ మెంటు పిల్లలలో కలిగించాలనే తపనతో శ్రీ వి.యన్.శర్మగారు ఫౌండర్ ప్రిన్సిపాల్‌గా ఆ స్కూల్ స్థాపించారు. మేము చదివేటప్పటికి వారి భార్య ఎలన్ శర్మగారు ప్రిన్సిపాల్‌గా ఉండేవారు. ఆమె జర్మన్ లేడీ అయినా భర్త ఆదర్శాలను నిలిపే విధంగా బడిని తీర్చిదిద్దారు.

ఆ ఆశయాలను ప్రాచుర్యంలోకి తెచ్చేందుకే అధ్యాపకులు పాటుపడేవారు. అందులో మా శారదాంబ టీచరు ప్రముఖురాలు. ఆమె తెలుగు, చరిత్ర చెప్పేవారు. పాఠాలు కళ్ళకు కట్టినంత వివరంగా అర్థమయ్యేటట్లు చెప్పేవారు. పరీక్షలు అవగానే 'పేపర్లు, పేపర్లు' అని పిల్లలు గోల చేస్తే 'దేవుడు ఆ రావణాసురుడికి ఇచ్చినట్లు నాకూ 20 చేతులు ఇస్తే బాగుండున్రా! మీకు వెంటనే పేపర్లు ఇచ్చేదాన్ని అని అంటూ నవ్వేసేవారు. 'కోపం ఎరుగని కోమలాంగి' ఆవిడ. ఎవరన్నా ఏదన్నా అర్థం కాలేదంటే మళ్ళీ, మళ్ళీ వివరంగా చెప్పేవారు. 'మీరు ఎప్పుడూ ఒకే అమ్మాయికో, అబ్బాయికో ఫస్ట్ మార్కులు వేస్తారు. మేము అలాగే రాశాము కదా!' అని ఎవరన్నా నిలదీస్తే పేపర్స్ కంపేర్ చేసి చూపించి వాళ్ళ తప్పు నిరూపించేవారు తప్ప కోపగించేవారు కాదు. 'టీచర్ తప్పు చేస్తే పిల్లలే దండించాలి. పిల్లల్ని టీచర్లు దండించినట్లు' అని చెప్పి ఒక ఉదాహరణ చెప్పేవారు.

ఒక ఫేర్‌వెల్ పార్టీలో ఒక విద్యార్థి పేరు చెప్పకుండా టీచర్ల తప్పులు ఎలా ఎత్తి చూపించాడో, ఆమెకి పుస్తకాలు కరెక్ట్ చేశాక విసిరికొట్టే అలవాటు ఉండేదట. పుస్తకాలు విసిరి కొట్టే అలవాటుండేదట. పుస్తకాలు పాడవుతున్నా పిల్లలు నోరు మెదపకుండా బాధపడేవారట. ఫేర్‌వెల్ పార్టీలో ఆ విద్యార్థి అలా పుస్తకాలు విసిరికొట్టి ఆమె తప్పు తెలిసికొనేటట్టు చేశాడట. ఇలా సున్నితంగా విధ్యార్థులు, టీచర్లు ఒకరికొకరు సరదాగా, సరళంగా కలిసి పోవాలని చెప్పేవారు.

ఇలా చదువులోనే కాక జనరల్ నాలెడ్జ్ రకరకాల పోయెమ్స్ సిలబస్ లో లేకపోయినా చెప్పి, చెప్పించి కాంపటీషన్ పెట్టి స్వంతంగా కూడా ప్రైజెస్ ఇచ్చేవారు. కేవలం డబ్బే కాదు ఇంట్లో పూచిన పూవో, పండో, నచ్చిన వారితో పరిచయమో, ఒక షేక్ హ్యాండ్ గాని, ఒక కౌగిలి, ఒక ముద్దు ఇవన్నీ అయిదవ క్లాసు లోపల చదివే పిల్లలకు పెద్ద అచీవ్ మెంట్స్ కదా. ఆ వయసులో పిల్లలకి నేర్పే జనరల్ నాలెడ్జ్ పెద్దలను హడలగొట్టేటట్లుగా ఉండేది. అమెరికా సంయుక్త రాష్ట్రాల గురించి ఎంత చెప్పేవారంటే అమెరికాలో పుట్టి, పెరిగిన వారికి కూడా తెలియనంతటి ఇన్ఫర్మేషన్, ఎన్నెన్ని పద్యాలు, శతకాలు ఆశువుగా చెప్పించేవారో. మా చేత రాయించేవారు కూడా మేము వ్రాసింది బోర్డు మీద పెట్టి కరతాళధ్వనులు చేయించేవారు.

ఇంతేకాకుండా తోటల్లో పూల పెంపకం, కాయగూరల పెంపకం, కుట్లు, అల్లికలు ఒకటేమిటి అన్నింటా మేము పురోభివృద్ధి పొందేటట్లుగా చేసేవారు. ఆ రోజుల్లో ఇప్పటి ప్రిన్సిపాల్ శకుంతల ముట్టుకుంటే మాసిపోయేటట్లుగా ఉండేవారు. మాలో ఎవరమన్నా, మా శారదాంబ టీచర్ పెట్టిన ఏ పరీక్షలో నెగ్గినా ఆమెతో షేక్ హ్యాండ్ ఇప్పించేవారు. లేకపోతే శర్మగారి లైబ్రరీలో కూర్చోనిచ్చేవారు. ఇంకా ఏదన్నా పుస్తకం ఇంటికి ఇప్పించి చదివించేవారు. చదివింది ఏమర్థమయిందో చిన్న పుస్తకంలో వ్రాయించేవారు.

చంద్రోదయం ఒక నెలలో ఏ టైంలో అవుతుందో చూసి బొమ్మలతో వ్రాయించేవారు. కొంతమంది చూడకుండా ఉజ్జాయింపుగా టైం బొమ్మలు వ్రాసి తీసుకు వస్తే, చంద్రోదయం సైకిల్ చక్కగా బొమ్మలతో ఎక్స్‌ప్లైన్ చేసి పౌర్ణమికి ముందు ఒక గడియ ముందుగాను, అమావాస్యకి ముందు ఒక గడియ ఆలస్యంగానూ చంద్రుడు ఉదయిస్తాడని ఎక్స్‌ప్లైన్ చేసింది జీవితాంతం మర్చిపోలేము కదా!

అలా చెప్పుకునే కొద్దీ తరగని కథల పెన్నిధి మా శారదాంబ టీచర్. అలాంటి టీచరు 'నభూతో నభవిష్యతి' అని చెప్పగలమే తప్ప.



శ్రీమతి ప్రమీలా చంద్రమోహన్ గారు , ఎమెస్కో పబ్లికేషన్స్ స్థాపకులు శ్రీ ఎమ్.ఎన్. రావు గారి పెద్దకుమార్తె.
భర్త , రిటైర్డ్ ప్రొఫెసర్, శ్రీ చంద్రమోహన్ గారితో తిరుపతిలో నివాసం.